క్లుప్తంగా

కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

వీరఘట్టం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 20 వరకు గడువు పెంచినట్టు జీసీసీడీఓ కె.రోజారమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన బాలికలందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లాలోని మీకు సమీపంలో ఉన్న కేజీబీవీలను సంప్రదించాలని కోరారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

గరుగుబిల్లి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొత్తూరు, శివ్వాం గ్రామాల్లో కేంద్ర భద్రతా బలగాలతో కలిసి పోలీసులు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం మనకు కల్పించిన ఓటును రానున్న ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ అమ్మనరావు కోరారు. ఎన్నికల వేళ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శ్రీరామ దీక్షలు ప్రారంభం

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో శ్రీరామ దీక్షలు ప్రారంభమయ్యాయి. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీరామ భజన మండలి సభ్యులతో పాటు మరికొంతమంది భక్తులు గురువారం మాల ధారణ చేసి, దీక్షలు చేపట్టారు. శ్రీరామనవమి వరకు కొనసాగే ఈ దీక్షల్లో ప్రతిరోజూ ఉదయం, రాత్రి శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భజన కార్యక్రమాలు ఉంటాయని దీక్షాపరులు తెలిపారు. కార్యక్రమంలో జి.చినతిరుపతిరావు, జి.భాస్కరరావు, ఎస్.నారాయణరావు, నరసింహులు, శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ యాలాం పరిసర ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. నెల 13వ తేదీన పట్టణంలో ఎం ఎం.నగర్, ఎన్‌కే.రాజపురం, సీఎల్.నాయుడు నగర్, కోమటిపేట, శ్రీనివాస నగర్, దేవర పేట, వెంకమ్మపేట, శ్రీకాకుళం, సీతంపేట రహదారుల్లో, చిన్న, పెద్ద కాపువీధుల్లో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. ఒక రోజు ముందుగా తెలియజేస్తున్న క్రమంలో వినియోగదారులు, ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు



అంకుళ్లువలసలో కాంతిని వెదజల్లుతున్న ఎల్‌ఈడీ బల్బు

కొమరాడ: మండలంలోని అంకుళ్లువలస, కోనవలస, మసిమండ, పూడేస్, సరుగుడుగూడ, బూర్జివలస, బంజకుప్ప తదితర గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు జన కళ్యాణ సమాఖ్య ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ బల్బులు గురువారం ఏర్పాటు చేశారు. ఆయా గిరిజన గ్రామాలు ఇప్పుడు విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతుండడంతో అక్కడి వారి ఆనందానికి అవధుల్లేవని సంస్థ కార్యదర్శి నిధిల్ వర్గీస్ తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని గిరిజన గ్రామాలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

గోండ్వాన దండకారణ్య పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉమా

సీతంపేట: గోండ్వాన దండకారణ్య పార్టీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీతంపేట మండలం శిలిగాం గ్రామానికి చెందిన బిడ్డిక ఉమా మహేశ్వరరావు పేరును ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. రాష్ట్రంలో 5 శాసనసభ, 1 పార్లమెంటరీ స్థానానికి అభ్యర్థులను ఖరారు చేస్తూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సోడే వెంకటేశ్వర్లు, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ ఆదేశాల మేరకు మండలంలోని ఒడిశా సరిహద్దు గ్రామాలు కంచరపాడు, జైకోట, తదితర గ్రామ పరిసరాల్లో సారా తయారీ కేంద్రాలపై ఒడిశా పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా 9వేల లీటర్ల బెల్లం ఊట,70 డ్రమ్ములు, 300 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసి కేసు నమోదు చేసిననట్లు కొమరాడ ఎస్సై నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, సారా తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఎన్నికల నియామవళిలో భాగంగా నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ నరసింగ్ రావు, ఎస్సై పద్మావతి పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్‌తో పాటు స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళావతికి జన నీరాజనం

- గ్రామాల్లో ఫ్యాన్ సుడిగాలి
- జోరుగా ఎన్నికల ప్రచారం



బిల్లుమడలో ఎమ్మెల్యే కళావతికి మద్దతుగా పార్టీ నాయకుల ప్రచారం

భామిని: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆమెకు నీరాజనం పట్టారు. బిల్లుమడ కాలనీ, పాత బిల్లుమడ, నేరడి బీ, గురండి, లోహరిజోల, వడ్డంగిగూడ, మూలగూడ, వడ్డంగి, బొమ్మిక గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. నుదుట కుంకుమ దిద్ది హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలంట అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. సంక్షేమ ఫలాలు మళ్లీ అందరికీ అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. అభివృద్ధికి మారుపేరుగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ప్రచారంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ కె..కామేశ్వరి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, మండల పార్టీ నాయకులు టి.సింహాచలం, బి.ధర్మారావు, కె.చిరంజీవులు, ఎం.మోహనబాబు, జి.రమేష్, కె.చంద్రశేఖర్, కె.ఫల్గుణరావు, అగతముడి రఘు, బోదెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె గ్రామదేవతలకు పూజలు చేసి ప్రచారం చేపట్టారు. జగనన్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఇప్పించాలని కోరారు.

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం



రామాలయ ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: మండలంలోని బూరగ గ్రామంలో అత్యాధునికంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు సర్వాజోశ్యుల రమేష్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో తొలి రోజు దేవతా విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అంతకు ముందు ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలు సతీసమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరండి

పాలకొండ: శ్రీకాకుళంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరగనున్న వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశానికి పార్టీ నాయకులు తరలిరావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. ఉదయం 10 గంటలకు పార్టీ పెద్దలు వైవీ సుబ్బారెడ్డి, మజ్జి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమ



గుమ్మలక్ష్మీపురం: వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుది కపట ప్రేమ అని రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు విమర్శించారు. స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన నిన్నమొన్నటి వరకు వలంటీర్లను నానా తిట్లు తిట్టి, ఇప్పుడు అదే నోటితో వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామనడం..వలంటీర్లను ప్రసన్నం చేసుకోవడమేనని దుయ్యబట్టారు. ఆయన తీరును ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లోనూ టీడీపీ కూటమిని ఘోరంగా ఓడిస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీరఘట్టం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఓ బాలాజీ గురువారం తెలిపారు. దీని పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ఇక విద్యుత్ సమస్యలకు చెక్ పడనుందని తెలిపారు.

విద్యతోనే సమాజానికి వెలుగు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్స్‌పాల్, అధ్యాపక సిబ్బంది

పాలకొండ రూరల్: చదువులతోనే సమాజంలో వెలుగు నిండుతుందని గట్టిగా నమ్మిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. తమ కళాశాలలో గురువారం పూలే జయంతిని విద్యార్థులు, సహ ఉద్యోగులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంటరాని తనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలు, అణగారిన వర్గాల ప్రజలను విద్యావంతులుగా తీర్చిదిద్దటం కోసం ఎనలేని కృషి చేసిన ఘనత పూలేకే దక్కుతుందన్నారు. అంతకుముందు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, అధ్యాపక సిబ్బంది బి.రాజు, ఎం.శాంతి, శ్రీనివాసరావు, రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం వద్ద ముమ్మర ఏర్పాట్లు



స్ట్రాంగ్‌రూం పనులు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ: ఈవీఎంలు భద్రపరిచే గదుల వద్ద గురువారం ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఇటీవల కలెక్టర్ స్ట్రాంగ్‌రూంను పరిశీలించి మార్పులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ వరహాలు, సర్వేయర్ వెంకటరావు పనులు ముమ్మరం చేశారు. వాహనాల కోసం కళాశాల మైదానం పూర్తిగా జేసీబీతో చదును చేయించారు. స్ట్రాంగ్‌రూం గదులకు వెలపల నుంచి ప్లేఉడ్‌తో సీల్ చేయించారు. పోలింగ్ సిబ్బంది కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



కురుపాం: మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు



భామిని: బత్తిలి మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు

కురుపాం: మండల కేంద్రంలోని జామియా మసీదులో రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో ముస్లిసోదరులు గురువారం జరుపుకున్నారు. 30 రోజుల పాటు కఠోర నియమాలతో ఆచరించిన ఉపవాస దీక్షలు విరమించిన అనంతరం ప్రత్యేక నమాజ్(ప్రార్థన)లు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రతీ ముస్లిం విధిగా పాటించాల్సిన నియమాలు, రంజాన్ విశిష్టతను మసీదు ఆమామ్ సర్దార్ ఆలం తెలిపారు. మాజీ కేంద్రమంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రసూర్యనారాయణ దేవ్‌ను ముస్లిం సోదరులంతా మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మతపెద్దలు షేక్ అతవుల్లా, ఖలీల్, జిలానీ, అజీం భాషా తదితరులు పాల్గొన్నారు.

బత్తిలిలో...

భామిని: మండలంలోని బత్తిలిలో గురువారం ముస్లిం సోదరులు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బత్తిలి పోలీస్‌స్టేషన్ సమీపంలోని మసీద్ వద్ద ఈద్ రంజాన్ నమాజ్‌లు నిర్వహించారు. మసీద్ ఇమామ్ షాబ్ షేక్ ఆలమ్ ఆధ్వర్యంలో కురాన్ వ్యాఖ్యలు వినిపించారు. రంజాన్ నమాజ్ అనంతరం నెల రోజుల ఉపవాసాన్ని వీడారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కరెంట్ కష్టాలకు చెక్



వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్

- నేటి నుండి వాడుకలోకి రానున్న కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్
- రూ.1.20 కోట్లతో వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్ అభివృద్ధి

వీరఘట్టం: రాష్ట్ర ప్రజలకు కరెంటు చీకట్ల కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ల అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం వీరఘట్టం మండల కేంద్రంలో ఉన్న 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేసింది. సుమారు రూ.80 లక్షల విలువ గల 5 ఎం.వి.ఏ సామర్థ్యం గల కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మరో రూ.40 లక్షల వ్యయంతో 33 కేవీ బ్రేకర్, 11 కేవీ బ్రేకర్లు ఏర్పాటు చేసారు. ఈ పనులు గురువారం పూర్తవడంతో శుక్రవారం ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను వాడుకలోకి తెచ్చి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఇదీ పరిస్థితి...

వీరఘట్టం మండల కేంద్రంలో ఉన్న 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కడకెల్ల, నర్సుపురం, బిటివాడ, వీరఘట్టం టౌన్ ఫీడర్లు ఉన్నాయి. వీటి పరిధిలో 19 వేలు గృహ వినియోగదారులు, 1000 వరకు వ్యవసాయ మీటర్లు ఉన్నాయి. శీతాకాలం, వర్షాకాలంలో ప్రతీ రోజు సుమారుగా 200 యాంప్స్ అనగా 3.5 ఎంవీఏ(మెగా ఓల్ట్ ఆంపియర్) కరెంటు వినియోగం జరుగుతోంది. అదే వేసవి కాలంలో రెండింతలు విద్యుత్ వినియోగం పెరగడం వల్ల సుమారు 6.5 మెగా ఓల్ట్ ఆంపియర్ కరెంట్ వినియోగం జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోకపోవడంతో ప్రతీ ఏటా వేసవిలో కరెంటు కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇక మీదట అటువంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం వీరఘట్టం సబ్‌స్టేషన్‌లో ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 5 మెగా ఓల్ట్ ఆంపియర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసారు. ఇక నుండి విద్యుత్ కోతలు తగ్గడంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నేడు కొత్త ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

వీరఘట్టం సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ కెపాసిటీ ఉంది. ప్రతీ ఏటా వేసవిలో 6.5 ఎంవీఏ విద్యుత్ వాడకం జరుగుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసింది. గత కొద్ది రోజులుగా ఈ పనులు చేపడుతున్నాం. గురువారంతో ఈ పనులు పూర్తి కావడంతో శుక్రవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసాం.

– డి.బాలాజీ, ట్రాన్స్‌కో ఏఈ, వీరఘట్టం

జ్వరాల సీజన్.. తస్మాత్...



ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్ రోగులు

సీతంపేట: అధిక ఉష్ణోగ్రతలు, ఆపై ఉక్కపోత జనాలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. వెరసీ మన్యంలో జ్వరపీడితుల కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో ఏజెన్సీ పీహెచ్‌సీలు కిటకిటలాడుతున్నాయి. రోజు, రోజుకు ఎండలు మండిపోతున్నాయి. తెల్లారింది మొదలు, రాత్రి వరకు వేడి గాలులతో ప్రజలు అల్లాడుతున్నారు. 40 నుంచి 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. దీంతో వైరెల్, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతుండడంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఎక్కడ చూసినా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వరాలతో ఆసుపత్రులకు వెళ్ళేవారి సంఖ్య అధికమౌతుంది. అక్కడక్కడా మలేరియా, టైఫాయిడ్ వంటి కేసులు నమోదౌతున్నాయి. మారుమూల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు 50 నుంచి 60 వరకు రోజుకూ వివిధ రకాల కేసులు వస్తుండగా వాటిలో 20 వరకు జ్వరాలే ఉంటున్నాయి. స్థానిక ఏరియా ఆస్పత్రికి మాత్రం రోజులో 150కి పైనే వోపీ ఉంటుంది. సీతంపేట ఏజెన్సీలో సీతంపేట ఏరియా ఆస్పత్రి, కుసిమి, మర్రిపాడు పీహెచ్‌సీలు ఉన్నాయి. రోగికి చేసిన రక్త పరీక్షల్లో 60 శాతం టైఫాయిడ్ కేసులు నమోదౌతున్నాయి.

అందుబాటులో అన్ని రకాల మందులు

మన్యంలో అన్ని రకాల వ్యాధులకు పీహెచ్‌సీల్లో మందులను అందుబాటులో ఉంచారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో కూడా వచ్చిన రోగులకు రక్తపరీక్షలు చేసి, ఆయా స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యసేవలు అందజేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్యసేవలు అందిస్తున్నామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

పిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో పిల్లల విషయంలో తల్లితండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. చంటి పిల్లలకు సంబంధించి తల్లి పాలు అధిక మోతాదులో బిడ్డకు ఇవ్వడం వలన వారి శరీరంలో ఉష్ణోగ్రతల్లో ఎటువంటి మార్పులు సంభవించక ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. చిన్నారుల ఒంట్లో ఉష్ణోగ్రతలు పెరిగితే పచ్చకామెర్లు (జాండిస్) సోకే ప్రమాదం ఉందని గుర్తించాలన్నారు.

మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలకు నీటిని అధికంగా అందించాలని, వేడి గాలుల నుంచి రక్షణ కోసం పలుచని కాటన్ దుస్తులు వేయించాలని, ఈ దుస్తులు ఎప్పటికప్పుడు తడపాలన్నారు. పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు, వృద్ధులు శరీరంలో ఉష్ణోగ్రతల సమతుల్యతను కాపాడుకునేందుకు వైద్యుల సూచనలు పాటించాలన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించండి

గుమ్మలక్ష్మీపురం: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు సూచించారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని సూచించారు. ఏదైనా పని కోసం బయటకు వెళ్తే గొడుగు, తాగునీరు వెంట పట్టుకునివెళ్లాలని తెలిపారు. వడదెబ్బకు గురైనవారు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఎండలో ఎక్కువగా తిరగవద్దన్నారు. తరచూ నిమ్మరసం, కొబ్బరికాయ నీరు, మంచినీరు, మజ్జిగ తీసుకోవడం మంచిదన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్. శర్మయాజీ సహకారంతో అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం జరిపారు. ఈ హోమం చేస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం పంచిపెట్టారు.

పెరిగిన ఉపాధి వేతనం



ఉపాధి పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

భామిని: వలసల నివారణకు ప్రభుత్వం చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి వేతనదారులకు రోజువారీ వేతనం రూ.300 పెంచడం శుభ పరిణామమని బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ అన్నారు. మండలం సొలికిరి అప్పలనాయుడు చెరువు వద్ద ఉపాధి పనులకు వారు గురువారం భూమి పూజ చేసి మాట్లాడారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకొని ఉపాధి పనులు చేసుకొని తగిన వేతనాలు పొందాలని సూచించారు. ఏఎంసీ డైరక్టర్ కొత్తకోట ఆంజనేయులు, మేడిబోయిన చలపతి, ఉపాధి ఏపీఓ ఈ.తులసీదాస్, టీఏ, ఎఫ్ఏలు, వేతనదారులు పాల్గొన్నారు.

'వే'దన తీరింది..!



చిత్రంలో కనిపిస్తున్నది.. గుమ్మలక్ష్మీపురం మండలంలోని శిఖలబాయ్ గ్రామానికి వెళ్లే రోడ్డు. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. దీంతో అటు వైపుగా వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే సమస్యను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లగా, ఆమె చొరవతో మంజూరైన రూ.1.15 కోట్లతో బీటీరోడ్డు నిర్మించారు. చాలారోజులకు తమ వేదన తీరిందని, అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ విజ్ఞప్తుల మేరకు సమస్య పరిష్కరించినందుకు గాను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

-కురుపాం.



రోజంతా చల్లని గాలులు

భామిని: మండలంలో గురువారం రోజంతా చల్లని గాలులు వీచాయి. వాతావరణం చల్లబడింది. ఉత్తర గాలులు ఉదయం నుంచే వీయడంతో వాతావరణం మారింది. కొద్ది రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయిన ప్రజలకు గురువారం వీచిన గాలులు ఉపశమనం కలిగించాయి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com